ప్రజాశక్తి
మంగళవారం 14 అక్టోబర్ 2025
5
అనంతపురం

ఐద్వా పతాకావిష్కరణ దృశ్యం

కదం తొక్కిన మహిళా లోకం

'అనంత'లో భారీ ప్రదర్శన
ఆరంభమైన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ
వేలాదిగా తరలివచ్చిన మహిళలు

మహిళాలోకం కదం తొక్కింది. అనంతపురం నగర వీధుల్లో ఐద్వా జిందాబాద్ నినాదాలు హోరెత్తాయి. ఐద్వా జెండాలను చేతబట్టుకుని వందలాది మంది మహిళలు ముందుకుసాగారు. వారి ముందు ఉరుముల కళాకారుల ప్రదర్శనలు సాగగా, మహిళలు కోలాటం ఆడుతూ ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళా ఉద్యమంలో పాల్గొని అమరులైన 13 మంది నాయకుల చిత్రపటాలను చేతబూని ఐద్వా కార్యకర్తలు ముందుకు కదలడం చూపరులను ఆకట్టుకుంది. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు సోమవారం అనంతపురం నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ మహాసభ ప్రారంభానికి ముందు నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఉమ్మడి జిల్లా నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం లలిత కళాపరిషత్ హాలులో బహిరంగ సభ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త తీస్తా సెతల్వాద్, ఐద్వా జాతీయ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభలో ముఖ్య అతిథి తీస్తా సెతల్వాద్‌తో పాటు ఐద్వా జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఎస్.పుణ్యవతి ప్రసంగించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

ఉత్సాహభరితంగా మహాసభ ప్రారంభం

ఐద్వా రాష్ట్ర 16వ మహాసభ ఉత్సాహభరిత వాతావరణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆరంభమయ్యాయి. నగరంలోని ఎంకెఎం ఫంక్షన్‌లోని లక్ష్మిసెగల్ ప్రాంగణంలో మొదలయ్యాయి. మహాసభ ప్రారంభానికి ముందు ఐద్వా సీనియర్ నాయకురాలు ఒడ్డుపల్లి నాగమ్మ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రబీయాబి వేదికపై సభ ప్రారంభమైంది. మొదట అమరులైన ఐద్వా నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతులకు సంతాప తీర్మానం అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు పద్మజ జిల్లా చరిత్రతోపాటు మహిళల స్థితిగతులపై ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలుగులో అనువాదం చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని వారి సౌహార్ద్ర సందేశమిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

◆ **బిజెపిని ప్రశ్నించలేని స్థితిలో బాబు :** కేంద్రంలో భాగస్వామిగానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధుల కోసం బిజెపి గట్టిగా ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే విమర్శించారు. ఆహార భద్రతకు, ఉపాధి భద్రత కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు రాబట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. కేంద్రానికి సాగిలపడి పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ చంద్రబాబు, బీహార్‌లో నితీష్‌కుమార్ మద్దతు లేకపోతే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండే అవకాశమే లేదని చెప్పారు. దేశంలో మహిళలపై హింస రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థినిపైనా దాడి జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు మహిళల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

◆ **కేరళ ఆదర్శం :** దేశంలో కేరళ మహిళాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని ఐద్వా జాతీయ అధ్యక్షులు శ్రీమతి టీచర్ చెప్పారు. అక్కడ మహిళ అక్షరాస్యతపై దృష్టి సారించడమే కాకుండా వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. అందుకు రుణలివ్వడం ఒక్కటే కాకుండా బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఈ రాష్ట్రంలో ఐద్వా బలంగా ఉందన్నారు. సుమారు 80 లక్షల మంది సభ్యులున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఐద్వాలో పనిచేయడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హక్కుల కోసం, సమానత్వం సాధన కోసం సాగే పోరాటంలో భాగస్వామ్యులవ్వాలని పిలుపునిచ్చారు.

◆ **అభ్యుదయం 'అనంత'ం :** అభ్యుదయంలో అనంతపురం జిల్లా అగ్రగామిగా ఉంటుందని ఐద్వా కోశాధికారి ఎస్. పుణ్యవతి పేర్కొన్నారు. 1947లో జరిగిన ఐద్వా తొలి మహాసభలోనే ఈ జిల్లా నుంచి ప్రతినిధులు నలుగురు హాజరయ్యారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో యోగి వేమన కదిరి ప్రాంతంలో జన్మించారని తెలిపారు. కడప జిల్లాలో పోతులూరి వీర బ్రహ్మం జన్మించారని పేర్కొన్నారు. ఇటువంటి అభ్యుదయవాదులు పుట్టిన ఈ ప్రాంతమని పేర్కొన్నారు.

◆ **ఐక్య పోరాటాలు అవసరం :** సమాజంలో మహిళలపై వివక్ష దాడులు రూపమాపడం కోసం సమాన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ధక సందేశం ఇచ్చారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు సమాన హక్కులు లేకపోవడం విచాకరమన్నారు. ఇప్పుడు అందుతున్న హక్కులు నాడు ఉమ్మడి మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగా సాధ్యమయ్యాయన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడిప్పుడే మహిళలు రాణిస్తున్న నేపథ్యంలో సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటి కుందేళ్లుగా చేయాలని చూస్తున్నారని తెలిపారు. రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు.

◆ **ప్రేమ ఆప్యాయతలకు కొదవ లేదు :** కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా ప్రేమ, అప్యాయత, త్యాగాలు, పోరాట పటిమ, కళలకు కొదవ లేదని ఐద్వా మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షురాలు పద్మజ అన్నారు. ఎందరో మహనీయులు అనంతగడ్డలో జన్మించి చరిత్రలో నిలిచారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఐద్వా పనిచేయడం అభినందనీయమన్నారు.

శ్రీమతి టీచర్ | పుణ్యవతి | దుర్గా భవాని | పద్మజ

మహాసభల సందర్భగా భారీ ర్యాలీ

చిన్నారుల ఐక్యతా నృత్యప్రదర్శన

తహాశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - బొమ్మనహల్

మండలంలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన రైతు మల్లిఖార్జున సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగడానికి ప్రయత్నిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడున్న వారు గమనించి అతని ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈసందర్భంగా బాధిత రైతు మల్లిఖార్జున తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తనకున్న 5 ఎకరాల పొలంలో పప్పుశనగ పంటసాగు చేశానన్నారు. అయితే సిద్ధరాంపురం బొల్లనగుడ్డం గ్రామాలకు చెందిన రైతులు పొలాలపై పంటకాలువ, వర్షపునీరు తమ పొలాల్లోకి వెళ్లకుండా అడ్డువేయడంతో తన పొలంలోకి వచ్చి పంట మునిగిపోతోందన్నారు. కొంతమంది రాజకీయంగా అడ్డు వేయడం వల్ల పలువురు రైతులకు చెందిన సుమారు 90 ఎకరాల భూమి పప్పుశనగ పంట మునిగిపోయిందని మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్యను రెండునెలలుగా తహాశీల్దార్‌కు, ఎస్ఐకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. రైతు ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న తహాశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ ఘటనాస్థలంలో బాధితుడితో మాట్లాడారు. ఈనెల 22వ తేదీన క్షేత్రస్థాయిలో పర్యటించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యను వివరిస్తున్న బాధిత రైతు మల్లిఖార్జున

క్షణికావేశం.. స్నేహితుడి చేతిలో హతం

ప్రజాశక్తి - గుంతకల్లు

ఇద్దరు ప్రాణస్నేహితుల మధ్య నెలకొన్న గొడవ హత్యకు దారితీసింది. ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు... గుంతకల్లు పట్టణానికి చెందిన ఆనంద్, సలీం ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ఆదివారం అర్ధ రాత్రి ఇద్దరూ బస్టాండు సమీపంలో మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో ఆనంద్ తన స్నేహితుడు సలీం కుటుంబ సభ్యుల గురించి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో గొడవ ప్రారంభమైంది. ఈ గొడవ కాస్తా ఘర్షణకు చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో సలీం క్షణికావేశంతో ఆనంద్ అలియాస్ బొంబాయి తలపై బండ రాయితో కొట్టాడు. ఈ ఘటనతో తల పగిలి ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్నిస్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సలీంను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిసింది.

సలీం (ఫైల్‌ఫొటో)

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి

కౌలు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేల మొత్తాన్ని వెంటనే జమ చేయండంతోపాటు నూతన కౌలు చట్టం అమలు చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. అంతేగాకుండా తాము అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పారన్నారు. పాతచట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీలో పెట్టి ఇంతవరకు ఆమోదించలేదన్నారు. కౌలు రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కులాలతో సంబంధం లేకుండా భూమి లేని కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఒకే విడత రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుసంఘం, రైతు సంఘం నాయకులు కె.అంజనేయులు, జ్ఞానమూర్తి, కె.సిద్ధప్ప, జి.సీనప్ప, బి.మురళి, బి.వీర, రామాంజనేయులు, రాజ్‌కుమార్, ఎర్రిస్వామి, గంగన్న, రామప్ప, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కౌలు, రైతుసంఘం నాయకులు

ప్రధాని పర్యటనతో ఎవరికి ప్రయోజనం?

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో ప్రధానమంత్రి మోదీ పర్యటనతో ఎవరికి ప్రయోజనమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున ప్రశ్నించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ విజయోత్సవాల పేరుతో ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని మోదీ పర్యటనను రాష్ట్రవ్యాప్తంగా అన్ని వామపక్ష పార్టీలుముక్తకంఠంతో ఖండిస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ గత 16 నెలల కాలంలో నాలుగు సార్లు రాష్ట్రానికి వచ్చారన్నారు. ఒక్కసారైనా రాష్ట్రంతోపాటు ప్రజలకు మేలు చేసే పనులు చేశారా..? అని ప్రశ్నించారు. ఊకదంపుడు ఉపన్యాసంతో మాటల గారడీతో రాష్ట్ర ప్రజలను ఎన్నిసార్లు మోసం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ట్రంపు సుంకాల టెర్రరిజం, హెచ్‌వన్‌బి వీసా ఫీజు పెంపు వల్ల నేడు దేశంలోని యువత, చిన్న, మధ్య పరిశ్రమలు ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇచ్చిన ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీలు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి పూనుకోకపోగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను మొండిగా మోదీ ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమైందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ఖజానాకు తగ్గనున్న రూ.9వేల కోట్ల లోటును కేంద్రం నుంచి రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సిఎం, డిప్యూటీ సిఎంకు సూచించారు. అలాకాకుండా ప్రజలపై అదనపు భారాలు మోపుతామంటే సిపిఎం, రాష్ట్ర ప్రజలు సహించారని తెలిపారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను హామీలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ పర్యటన నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన తలపెట్టిన నిరసనలో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దసంఖ్యలో పాల్గొని నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు మధు, తిమ్మరాజు, కృష్ణ, నాయక్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అభిమానులు.. కార్యకర్తలే మా బలం

మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఏది జరిగినా నిమిషాల్లో తన ఇంటి వద్దకు చేరుకునే జెసి అభిమానులు, కార్యకర్తలే తనకు దేవుళ్లు అని మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టిడిపి నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సోమవారం పట్టణంలోని పద్మావతి కళ్యాణ మండపంలో కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మున్సిపాలిటీ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఓటమి పాలైనా ఇక్కడి ప్రజలు, అభిమానులు తనను ఆదరించారన్నారు. అంతేగాకుండా ఐదు నిమిషాల సమయం ఇస్తే తన ఇంటి వద్దకు వేల సంఖ్యలో హాజరవుతారన్నారు. అందుకే మీరే నాకు దేవుళ్లు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని, ఆయన పనితీరు ప్రజలలోకి తీసుకెళ్లి చంద్రబాబుకి అండగా నిలవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో మంచి సంబంధాలు ఉన్న వారికే సీట్లు కేటాయిస్తారన్నారు. ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ఆదరణ పొందాలని వారిని అధిష్టానం అర్హులుగా గుర్తిస్తుందన్నారు. కాగా పార్టీ నిర్ణయానికి లోబడి నడుచుకోనందున కాకర రంగనాథ్, వారి బ్రదర్స్‌ను టిడిపి నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

మహరాజ శ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 17/2025
Between:
N.భవాని ...వాది
AND
P.రాజరమేష్ ...ప్రతివాది
To,
D2: పెల్లకూరి.రాజరమేష్ Age 45 years, Teacher S/o P.భాస్కర్ D.No.3/799-15-2, 9th road, కృష్ణాపురం తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.
ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలో వాది తనకు రావలసిన ప్రామిసరి నోటు బాకీ నిమిత్తము, పై కోర్టులో 20-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ.చింతా రమేష్ నాథ్ రెడ్డి,
శ్రీ కళ్యమడి శంకర రెడ్డి,
శ్రీ దాసరి శివరామకృష్ణ
వాదితరపున న్యాయవాదులు, తాడిపత్రి

మహరాజ శ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 300/2024
Between:
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిపత్రి
Rep by its Bank Manager ...వాది
AND
1.N.లక్ష్మీదేవి
2.M.నాగభూషణం ...ప్రతివాదులు
To,
D2: ముచ్చుమర్రి నాగభూషణం @ భూషణ్ S/o Late M.స్వామిదాసు Age 27 R/o D.No.3/48L1, గెన్నెవారిపల్లి కాలనీ, కడప రోడ్డు, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.
రెండవ దావా ప్రతివాదికి సమన్లు
పై దావాలో వాది తనకు రావలసిన క్రాపులోను బాకీ వసూలు నిమిత్తము పై కోర్టులో నీ పై దావా దాఖలు చేసియున్నారు. నీ హాజరు నిమిత్తము కోర్టువారు 18-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు. పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ.సి. రమేష్ నాథ్ రెడ్డి,
కె.శంకర రెడ్డి,
వాదితరపున న్యాయవాదులు, తాడిపత్రి

మహారాజరాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో, అనంతపురము.
I.PNo.2/2022
Between:
కానా రామిరెడ్డి మరియొకరు ...వాదులు
AND
పుట్టపర్తి రామాచారి మరియు ఇతరులు ...ప్రతివాదులు
మొదటి మరియు రెండవ ప్రతివాదులకు నోటీసు
1) పుట్టపర్తి రామాచారి, తండ్రి పి. రామచంద్రాచారి,
2) పుట్టపర్తి లక్ష్మణాచార్, తండ్రి పి.రామచంద్రాచారి,
ఇద్దరి నివాసం: ఇంటి నెం.22-152, మహల్దార్ స్ట్రీట్, అనంతపురము పట్టణం మరియు జిల్లా.
ఇందుమూలముగా మొదటి మరియు రెండవ ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడమేమనగా, పై వాది మీపై పైకేసును దాఖలు చేసినారు. మీకు పలుమార్లు నోటీసులు పంపినను చేరనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుటకు పై కేసును 29-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా:29-10-2025
శ్రీ భాస్కర రవిప్రసాద్,
వాదిపరం న్యాయవాది, అనంతపురం

IN THE COURT OF THE PRINCIPLE SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
E.P.No:15/2025 in O.S No.83/2008
Between:
Smt. K. Padma Latha, D/o Late K. Subbanna, Resident of D.No.17-1-172, Nandi Timber Depot, Venguopala Nagar, 80 feet Road, Anantapuramu. ...Petitioner/ D.Hr
AND
K.Srinivasulu(DHr) Ediga Savithramma and others ...Respondants/J.Drs
Notice to the J.Dr No:2,3,4,5
J.Dr.2: Ediga Savithramma, W/o Late E.Pandu Rangaiah
J.Dr.3: Ediga Aswartha Narayana, S/o Late E.Pandu Rangaiah,
J.Dr.4: Ediga Sujatha, D/o Late E.Pandu Rangaiah,
J.Dr.5: Ediga Sarala, D/o Late E. Pandu Rangaiah,
All are R/at D.No.20/90, Opp. Kasturi Bai School, Gandhi Nagar, Old town, Ananthapuramu. Now at Syndicate Nagar, Anantapuramu.
పై నెంబరు కేసులో J.Dr's అయిన మీ హాజరు నిమిత్తము 30-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
P.Guru Prasad,
Advocate, Ananthapur

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.P.No:127/2024 in ARB Case No: ARC/FSBFL/1120
Between:
M/S. Five Star Business Finance Limited, Ananthapur Represented by its Authorized Signatory, Y.Shyam Prasad, Ananthapur.
...Petitioner/ D.HR
V/S
J.Dr1:Bugude Manoj Kumar S/O Bugude Nagaraju,, business, D.No.1-132, D.Hirehal Village and Mandal, Anantapur Distict.
J.Dr2: Bugude Lalitha W/O Bugude Nagaraju, D.No.1-132, D.Hirehal, Anantapur District.
...Respondants /J.DRS
వేలం ప్రకటన
అర్జీదారుడు ఇ.పి. మొత్తమును రాబట్టుటకు J.Drsకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచినవారు **24-10-2025** వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.
SCHEDULE
The property is situated in R.D Anantapur and SRD of Rayadurgam, within the fields of D.Hirehal Village and Gram Panchayat, D.Hirehal Mandal, Anantapur DistrictSy.No. 406/2A, Extent; 94.44 sq yards,D.No; 3/12,Asst.No; 364,Boundaries:East by: Land of Thippeswamy, West by: Bugade Narayanappa's House, North by:Road and South by: Land of Thippeswamy.Measurements:East-West-34 feet or 10.21 meters and North-South-25 feet or 7.51 meters. totally measuring 94.44 sq yards.
DHr Value Rs.2,50,000/-
Ameen value,Rs:4,87,500/-
(By Order of the Court)
M.SURESH KUMAR,
Advocate, Ananthapuramu.
Cell:9441168233



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్, సభ్యులు

మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఛైర్మన్‌గా భూమా నాగరాగిణి, వైస్ ఛైర్మన్‌గా పరిమి శ్రీహరి, కమిటీ సభ్యులుగా బి.జయరాముడు, జెడ్ శ్రీనివాసులురెడ్డి, ఎన్.జ్యోతి, డి.ఆదెమ్మ, బి.వీరశేషానందరెడ్డి, అబ్దుల్‌రహీం, టి.శ్రీదేవి, కాజాపీర్ బాషా, ఎల్.సీతమ్మ, బి.ఆదినారాయణ, జే.సహేరాబాబు, కె.భువనేశ్వరి, ఎల్.ఆమని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు నూతన కమిటీ సభ్యులు యార్డును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమ నాగరాగిణి మాట్లాడుతూ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, జెసి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

వేతనాలు ఇవ్వండి సారూ..

మండల సమావేశంలో ఎంపిటిసిల మొర

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అధికారులను నిలదీస్తున్న ఎంపిడిఒ

'24 మాసాల నుంచి వేతనాలు ఇవ్వలేదు.. మాపై అధికారులకు ఇంత నిర్లక్ష్యం తగదు' అంటూ మండలంలోని ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పద్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఎంపిటిసిలు నిరసన తెలిపారు. వీరికి సర్పంచులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎంపిటిసిలు మాట్లాడుతూ ఎంపిటిసిలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం 24 మాసాల నుంచి ఇవ్వలేదంటే తమపై నిరక్ష్యం తెలుస్తుందన్నారు. ఇందుకు ఎంపిడిఒ విజయభాస్కర్ స్పందిస్తూ ప్రభుత్వం విడుదల చేసేంత వరకూ తాము ఏమీ చేయలేమన్నారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపిడిఒ చర్చించి ఆందోళనలను విరమింపజేశారు. తర్వాత పలు అంశాలపై నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచు కృష్ణ, తహశీల్దార్ మునివేలు, ఇఒఆర్‌డి దాస్, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ జగదీష్, ఎంఇఒ మల్లికార్జున, పశు వైద్యాధికారి వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిని 1200 పడకల స్థాయికి మారుస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా మారుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలను రాష్ట్రంలో మరింత విస్తృతం అయ్యేలా చేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందని వారు ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఒక్క అనంతపురం నియోజకవర్గంలోని ఇప్పటి వరకు రూ.3.5 కోట్ల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే 560 పడకలుగా ఉన్న పెద్దాసుపత్రిని 1200 పడకలకు మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కులశేఖర్‌కు సిపిఎం సన్మానం

ప్రజాశక్తి-పుట్లూరు

కులశేఖర్‌ను సన్మానిస్తున్న సిపిఎం నాయకులు

పాణ్యంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో టిజిటి హిందీ ఉపాధ్యాయులుగా నియమితులైన మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన కులశేఖర్‌ను సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి పెయింటర్‌గా పని చేస్తూ డీఎస్సీకి సన్నద్ధమై టిజిటి హిందీ ట్రైబల్ వెల్ఫేర్‌గా సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మండల కార్యదర్శి సూరి, నాయకులు పెద్దయ్య, శివారెడ్డి, ఓబుళపురం భూసణ, కెవిపిఎస్ నాయకులు జె.పెద్దయ్య, ఆదినారాయణ, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ భవనం మార్పు

రాయదుర్గం : ఇదివరకు పట్టణంలోని ఓబులాచారి రోడ్డు వద్ద ఉన్న తపాలా కార్యాలయాన్ని దాసప్ప రోడ్డు సెయింట్ పాల్ హై స్కూల్, అజీజియా షాదీమహల్ పక్కన డోర్ నెంబర్ 15- 4- 461- 5-1 భవనంలోకి మార్చినట్లు తపాలశాఖ రాయదుర్గం సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ మహేష్, సబ్ పోస్ట్‌మాస్టర్ సురేంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరునామా మార్పును గమనించి తపాలశాఖతో సహకరించాలని కోరారు.

సిపిఆర్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ

నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) అవగాహన వారోత్సవాలను అనస్థీషియా ప్రధాన విభాగాధిపతి ఎ.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయశ్రీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఒకరి ప్రాణాన్ని సిపిఆర్ ద్వారా కాపాడితే వారి కుటుంబానికి ఎంతో మేలు చేసిన వారం అవుతామన్నారు. సూపరింటెండెంట్ కెఎల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ మెదడుకు రెండు నుంచి మూడు నిమిషాలు వరకూ ప్రాణ వాయువు అందకపోయినా కోలుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. కావున ఆ సమయంలో తక్షణమే సిపిఆర్ ద్వారా ప్రాణాన్ని కాపాడొచ్చన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనెడిక్ట్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికీ సిపిఆర్‌పై అవగాహన ఉండాలన్నారు. అనస్థీషియా ప్రధాన విభాగాధిపతి డాక్టర్ నవీన్ మాట్లాడుతూ సామాన్యుడు కూడా సిపిఆర్ ప్రాముఖ్యతను తెలుసుకోవడంతోపాటు ఇరుగు పొరుగు వారికి చెప్పడం ద్వారా ఎంతో మందిని అత్యవసర పరిస్థితుల్లో రక్షించవచ్చన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 17వతేదీ వరకూ సిపిఆర్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబిబిఎస్ విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లకు క్విజ్‌తోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు మధుసూదన్, శ్రీహరిబాబు, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ మనోహర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సుమన్ గోపీచంద్, లలితా భవానీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నూతన ఉపాధ్యాయులతో విప్ కాలవ శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం డి.హీరేహాల్ మండల పరిధిలోని మురడి ప్రాథమిక పాఠశాలలో 2025 మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా రాయదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడానికి సహకరించిన మంత్రి నారా లోకేష్, కలెక్టర్ ఆనంద్, జిల్లా విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియోజకవర్గానికి అత్యధిక సంఖ్యలో 247 మంది ఉపాధ్యాయులు వచ్చారన్నారు. 2026 జనవరిలో కొత్త డీఎస్సీ నియామకాలకు ప్రభుత్వం సమాయత్తమవుతున్న తరుణంలో వచ్చే సంవత్సరం నాటికి మిగతా 244 ఖాళీలు భర్తీ అవుతాయని ఆశిస్తున్నానన్నారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఉపాధ్యాయులు విధుల్లో గొప్పగా రాణిస్తూ విద్యాభివృద్ధి, విలువల పెంపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంతురెడ్డి, ఆర్య వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగల్లి రాజు, ఎంపిటిసి గంగాధర్, దొడగట్ట రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కుట్రలకు చెక్

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-శింగనమల

మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించాలనే కూటమి ప్రభుత్వ కుట్రలకు రచ్చబండ, కోటి సంతకాల కార్యక్రమాలతో చెక్ పెట్టనున్నట్లు మాజీమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి, కొరివిపల్లి, అలంకరాయణపేట, జూలాకాలువ, జలాలపురం గ్రామాల్లో వైసిపి నేతలు, కార్యకర్తలతో కలిసి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావైద్య వ్యవస్థను ప్రయివేటు చేతుల్లోకి వెళ్లనివ్వకూడదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావైద్యాన్ని ప్రయివేటీకరించే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో జగన్ పిలుపు మేరకు కోటి సంతకాల ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీగోకుల్‌రెడ్డి కంచిరడ్డి భాస్కర్‌రెడ్డి, ఉల్లికల్లు ఆలూరు పరంధామరెడ్డి, పూల ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు 'అందని ద్రాక్ష'లా వైద్యవిద్య

'రచ్చబండ'లో మాజీ ఎంపి తలారి రంగయ్య

ప్రజాశక్తి-కుందుర్పి

మాట్లాడుతున్న 'రచ్చబండ'లో మాజీ ఎంపీ తలారి రంగయ్య

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాల పిల్లలకు వైద్య విద్యను అందని ద్రాక్షలా చేస్తోందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో మండల కన్వీనర్ కె.హనుమంతురాయుడు అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యంతో సామాన్యుల ప్రాణాలు తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్ షాపులను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, నాయకులు మారుతీశ్వరి రామ్మూర్తి, మసాలా జగన్, విజయ్‌కుమార్, హసీనాబీ అత్తావుల్లా, ప్రభాకర్, గంగాధర్, ఈరన్న, తాలూకా ఎస్.బాబు, శ్రీనివాసులు, తిప్పేస్వామి, నాగలక్ష్మి, మర్రిస్వామి, వన్నూరురెడ్డి, పాలాక్షి, సత్యనారాయణశాస్త్రి, రాజగోపాల్, నరేష్, సోమశేఖర్, రాము, బొమ్మా లింగ, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

కళ్యాణదుర్గం రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న చెకుముఖి సంబరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం కంబదూరు మండల కేంద్రంలోని ఎంఆర్‌పి భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బి.ఉమాపతి, జడ్పీహెచ్ఎస్ ఇన్‌ఛార్జి హెచ్ఎం గాయత్రి, మోడల్ ప్రైమరీ హెచ్ఎం సిద్దేశ్వరప్ప, యుటిఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి, డిసెంబర్ 12, 13, 14వతేదీల్లో రాష్ట్రస్థాయిల్లో చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.చిత్తప్ప, సి.వెంకటేశ్వర్లు, కళావతి, కవిత, ఈరన్న, అప్సర, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం తక్కువ కాకూడదు..

ప్రజాశక్తి-బెలుగుప్ప



డెస్కులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

విద్యార్థుల హాజరు శాతం తక్కువ కాకుండా చూడాలని డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి ఆయా ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డెస్కులు, ముఖద్వారం ఇనుప గేటు నిర్మాణ పనులు, ఆర్చి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, స్కూల్ కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారంలోపు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందే..

పాపంపేట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ-కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పాపంపేట పరిరక్షణ సమితి నాయకులు

'కబ్జాదారుల నుంచి పాపంపేటను కాపాడుకుందాం' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాపంపేట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బాధితులతో కలెక్టర్ ఓ.ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పాపంపేట పొలం శోత్రియం భూములకు సంబంధించి రాచూరి వెంకట రమణశాస్త్రి, రాచూరి సుబ్రమణ్యంశాస్త్రి కుటుంబాలకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. వారి వద్ద ఎలాంటి నెల్లూరు సెటిల్‌మెంట్ పట్టాలూ లేవన్నారు. అయినా వారి వారసులతో జిపిఎ చేయించుకుని భూముల్లోకి వస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేలాది రూ.కోట్ల వసూళ్లకు తెగబడేందుకు ప్రణాళిక రచించారని ఆరోపించారు. నెల్లూరు సెటిల్‌మెంట్ పట్టాలు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్న కొనుగోలుదారులు బ్యాంకుల్లో కుదవ పెట్టి రుణాలు పొంది ఇళ్లు కూడా కట్టుకున్నారన్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తాయని, అలాంటి భూములకు ఎలా రుణాలు ఇచ్చారని ప్రశ్నించారు. శోత్రీయం భూముల యజమానులతో ఎమ్మెల్యే బంధువులు జిపిఎ చేయించుకున్నారని ఆరోపించారు. ఖాళీ స్థలాలు ఎక్కడుంటే అక్కడ వాలిపోతున్నారన్నారు. ఇప్పటికే 300 ఎకరాల దాకా జిపిఎ చేసుకుని గ్రామాలు, కాలనీలు ఖాళీ చేయించేలా ఈ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వీరిదెబ్బకు 10 వేల కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయన్నారు. వారంలోపు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయకపోతే బాధితులతో కలిసి రిజిస్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. చట్టపరంగా పోరాడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీమంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోలీసులతో మాట్లాడుతున్న మాజీమంత్రి సాకే శైలజానాథ్

కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని మాజీ మంత్రి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజానాథ్ భరోసా ఇచ్చారు. మండలంలోని చెదుళ్ల గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త వన్నూరప్పను, అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని కుటుంబ సభ్యులు శైలజానాథ్‌ను కలిసి వాపోయారు. ఇందుకు స్పందించిన శైలజానాథ్ వెంటనే బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని వివరించారు. వైసిపి కార్యకర్తపై కేసులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఏదైనా ఉంటే చట్టపరంగా వ్యవహరించాలని, ఎలాంటి వ్యక్తిగత అభియోగాల కోసం ఇలాంటి వేధింపులు చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పిటిసి భాస్కర్, నాయకులు బండ్లపల్లి ప్రతాపరెడ్డి, వట్టి కాటమయ్య, గాంధీనగర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో 'లిపిడ్ బేస్డ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్' సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

స్థానిక జెఎన్‌టియు ఒటిపిఆర్ఐలో సోమవారం 'లిపిడ్ బేస్డ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్' సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ ఔషధ రంగ నిపుణురాలు, జెఎన్‌టియు హైదరాబాద్, కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ సుల్తాన్పూర్‌లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.సునీతారెడ్డి ప్రసంగం చేశారు. తర్వాత ఒటిపిఆర్ఐ సంచాలకులు జీవి సుబ్బారెడ్డి విన్నపం మేరకు లిపిడ్ బేస్డ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ అనే అంశంపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎం.సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, కార్యక్రమ సమన్వయకర్త ఎం.మహేష్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'పై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఆదేశాలు, ఎస్పీ పి.జగదీష్ సూచనల ప్రకారం జిల్లాలోని పామిడి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ వింగ్ సబ్ ఇన్స్‌పెక్టర్ హనుమంత విద్యార్థులకు ఈగల్ సంస్థ స్థాపన ఉద్దేశం, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, రైళ్లపై ప్రత్యేక తనిఖీల వివరాలను వివరించారు. అలాగే మత్తు పదార్థాల వాడకంతో కలిగే శారీరక, మానసిక నష్టాలు, ఎన్‌డిపిఎస్ చట్టంలోని కఠిన శిక్షలు, ఆస్తి జప్తు విధానాలను వివరించడంతోపాటు, స్కూలు పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు సంబంధించిన ఏ సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1972, వాట్సాప్ నంబర్ 89777 81972 ద్వారా సమాచారం అందజేయాలన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, అతిథులు

నేరాలు ఘోరాలు

టిప్పర్- ఆటో ఢీ.. వ్యక్తి దుర్మరణం

తాడిపత్రి రూరల్ : టిప్పర్, ప్యాసింజర్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ దొడ్డకట్టెల కుళ్లాయప్ప (38) మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని పారిశ్రామికవాడ చుక్కలూరు రోడ్డులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. యల్లనూరు మండల కేంద్రానికి చెందిన కుళ్లాయప్ప ప్యాసింజర్ ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగా బాడుగ నిమిత్తం తాడిపత్రికి వచ్చి రూరల్ పరిధిలోని చుక్కలూరు రోడ్డు సమీపంలో ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుపై యూటర్న్ తీసుకుంటున్న ఆటోను గుర్తుతెలియని టిప్పర్ ఢీకొనడంతో కుళ్లాయప్ప తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి పోయాడు. గమనించిన స్థానికులు కుళ్లాయప్పను హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే కుల్లాయప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

డి.హీరేహాల్ : మండలంలోని ఓబుళాపురం చెక్‌పోస్ట్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ మహమ్మద్ షహజాద్ (43) విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ షహజాద్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ ఉన్నాడు. ఇతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈనేపథ్యంలో నాలుగు రోజుల క్రితం లారీలో వస్తూ ఓబుళాపురం చెక్‌పోస్టు సమీపంలో ఆపి టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా బళ్లారి నుంచి డి.హీరేహాల్ వైపు వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తమ్ముడు మహమ్మద్ మెహతాబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలెక్కుతూ ప్రమాదానికి గురైన వ్యక్తి

కళ్యాణదుర్గం టౌన్ : తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు ఎక్కుతూ భిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తి కాలు జారి కింద పడి గాయపడిన ఘటన సోమవారం కళ్యాణదుర్గం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలిల ఉన్నాయి. కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తిప్పేస్వామి భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఇందులో భాగంగానే మధ్యాహ్నం తిరుపతి నుంచి కదిరిదేవరపల్లికి వస్తున్న ప్యాసింజర్ రైలులో ఎక్కబోయి కాలు జారీ కింద పడ్డాడు. దీంతో రెండు కాళ్లు, ఒక చేయి నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే పట్టణ పోలీసులు బాధితున్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక డాక్టర్ల సలహా మేరకు అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతు

అనంతపురం : అనంతపురం రూరల్ కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం హంద్రీనీవా కాలువలో గల్లంతు అయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. నాగభూషణం ఇటీవల తమ సమీప బంధువు జీడిపల్లిలో మృతిచెందడంతో సోమవారం ఖర్మకాండ కు వెళ్లి వస్తూ మార్గమధ్యంలో పంపనూరు హంద్రీనీవా కాలువలో స్నానం చేసేందుకు దిగాడు. దీంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినటుల బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆత్మకూరు మండల పోలీసులు, గల్లంతైన వ్యక్తి బంధువులు గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది.

పేకాట జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్ : పేకాట ఆడుతున్న నలుగురు పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు రాబడిన సమాచారంతో సోమవారం సాయంత్రం తాడిపత్రి సబ్ డివిజన్ స్పెషల్ టీం చిన్న పొలమడ గ్రామ సమీపంలో ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసు సిబ్బంది స్పెషల్ టీంతో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని నిందితుల నుంచి రూ.8370 నగదుతోపాటు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.